క్లుప్తంగా

ముగిసిన జాతర



పట్నం వేస్తున్న ఒగ్గు పూజారి

చెన్నూర్‌రూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయం వద్ద జాతర ఆదివారం ముగిసింది. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో బోనాలు పోసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు. భక్తులు ఆలయ ఆవరణలో సామూహిక భోజనాలు చేశారు. పూజారులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది వరకు భక్తులు ప్రతి బుధ, ఆదివారాల్లో ఇక్కడ బోనాలు పోసి మొక్కులు తీర్చుకుంటారని ఆలయ పూజారులు తెలిపారు.

రేపు మహిళలకు వైద్య శిబిరం

శ్రీరాంపూర్: ఈ నెల 12న సింగరేణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్న శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవింద రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో ఉదయం 9గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. స్పెషలిస్టు వైద్యులు ఈ కార్యక్రమానికి హాజరు అవుతున్నారన్నారు. క్యాన్సర్, గర్భకోశవ్యాధులు, కిడ్నీ సంబంధించి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఈ వ్యాధులపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఉద్యోగుల కుటుంబాల్లో మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా ఉద్యోగులను సన్మానిస్తూ...

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 5వ వార్డులో సాయికుంట కాలనీలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల మహిళా ఉద్యోగులు, టీచర్లు, అంగన్‌వాడీ టీచర్లు, స్టాఫ్ నర్సులను సత్కరించారు. రెండు రోజుల పాటు మహిళలకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు.

వైద్య సేవలు విస్తరించాలి

జన్నారం: మారుమూల గ్రామాలకు వైద్య సేవలు విస్తరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ వైద్యులకు సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో అనేక మంది జ్వరాలతో అల్లాడుతున్నారని, ప్రజలు వడ దెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సిబ్బందిని పెంచి, గ్రామాల్లో వైద్య సేవలందేలా, ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కలమడుగులో నిర్మాణం పూర్తయిన ఉప ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించేలా చొరవ తీసుకోవాలన్నారు. నీటి కొరత లేకుండా చూడాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతీ గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకుని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

'నిజాయతీ ఉంటే అక్రమ దందాలు అరికట్టాలి'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్: కాంగ్రెస్ నాయకులకు నిజాయితీ ఉంటే అక్రమ రేషన్ బియ్యం దందాను అరికట్టాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, బీఆర్ఎస్ నాయకులు నాయిని సతీశ్, ఆశీస్‌లు అన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్‌లో దొంగలు చేరి అక్రమ దందాలకు తెరతీశారని ఆరోపించారు. రూ.50పైసల కమీషన్‌తో బియ్యం సరఫరా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు తుమ్మ రమేశ్, జోడు శంకర్, జగన్నాథుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



గూడెంలో వరద నీటిలో కొట్టుకుపోయిన వైకుంఠధామం

తీరని అంతిమకష్టాలు!

- వైకుంఠధామాల నిర్మాణంలో జాప్యం
- నిర్మించినా వసతులు లేవు
- రోడ్డు సౌకర్యం లేక వెళ్లలేని దుస్థితి
- అంత్యక్రియలకు తప్పని తిప్పలు
- చోరీలకు గురవుతున్న సామగ్రి
- పట్టించుకోని అధికారులు

పల్లె అయినా.. పట్టణమైనా.. చివరి మజిలీ సాఫీగా సాగాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతీ ఊరికి వైకుంఠధామం నిర్మించాలని నిర్ణయించింది. గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో, పట్టణాల్లో పట్టణ ప్రగతి నిధులతో వైకుంఠధామాల నిర్మాణం చేపట్టింది. కొన్నిచోట్ల నాసిరకంగా నిర్మించగా, మరికొన్ని చోట్ల అసంపూర్తిగానే మిగిలాయి. దీంతో అంతిమ కష్టాలు తీరడం మాట అటు ఉంచి, కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. నిర్మించిన వాటిలో సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు తిప్పలు పడుతున్నారు. వాగులు, నదులు ఒడ్డున నిర్మించిన కొన్ని వైకుంఠధామాలు వరదకు కొట్టుకుపోయాయి. జిల్లాలోని వైకుంఠధామాల పరిస్థితిపై 'సాక్షి' ప్రత్యేక కథనం

బెల్లంపల్లి నియోజకవర్గంలో....



నీలాయపల్లిలో పిచ్చిమొక్కలు మొలిచి...

బెల్లంపల్లి: తాండూర్ మండలంలోని మాదారం, రాజీవ్‌నగర్, నీలయాపల్లి, నర్సాపూర్, గోపాల్‌నగర్, చౌటపల్లి గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు ఊరికి దూరంగా కిలో మీటర్ల దూరంలో ఉండగా ప్రజలు అంతగా ఉపయోగించుకోలేక పోతున్నారు. మాదారం గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన వైకుంఠధామంలోని వెయిటింగ్ హాల్, స్నానాల గదుల తలుపులు, నీలాయపల్లి శ్మశాన వాటిక వాటర్‌ట్యాంక్ పైపులు, చేతి పంపు హ్యాండిల్ చోరీకి గురయ్యాయి.

- బెల్లంపల్లిలోని బట్వాన్‌పల్లి, ఆకెనపల్లి, బుచ్చయ్యపల్లి, పెర్కపల్లి, దుగినేపల్లి తదితర గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదు.
- నెన్నెలలో 19 వైకుంఠధామాలు నిరుపయోగంగా మారాయి. మూడు చోట్ల తప్పా మిగితా వాటిని వినియోగించడం లేదు. ఊరికి దూరంగా శ్మశానవాటికలను ఏర్పాటు చేయగా, రోడ్డు కూడా వేయలేదు. కరెంట్‌సౌకర్యం కల్పించలేదు.
- వేమనపల్లి మండలంలో 14గ్రామపంచాయతీల్లో శ్మశాన వాటికలు నిర్మించారు. రోడ్డు సదుపాయం లేదు. విద్యుత్, నీటి సౌకర్యం కల్పించలేదు. నిర్వహణ లేక స్నానాల గదులు చెత్తతో నిండిపోతున్నాయి. వేమనపల్లి శ్మశానవాటిక కమాన్ గోడ కూలిపోయింది.
- కాసిపేట మండలంలో వైకుంఠ ధామాల నిర్మాణాలు గ్రామాలకు దూరంగా, తూతూమంత్రంగా నిర్వహించారు. ఏ ఒక్కచోట కూడా ఉపయోగంలో లేవు. కరెంట్, నీటి సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించలేదు. ప్రభుత్వ భూముల్లో, కొన్నిచోట్ల ప్రధాన రోడ్ల పక్కన ఉన్నా, ఇప్పటి వరకు ఏ ఒక్కసారి కూడా వినియోగించిన దాఖలాలు లేవు.



కాసిపేట మండలం సోమగూడెంలో...

మంచిర్యాల నియోజకవర్గంలో...

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో శ్మశానవాటికలు లేకపోవడంతో దహన సంస్కారాలు నిర్వహించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి నాలుగు వైకుంఠధామాలు మంజూరైనా ఇప్పటికీ ఒక్కటి కూడా వినియోగంలోకి రాలేదు. పాత మంచిర్యాల, ఆండాళమ్మ కాలనీలో మాత్రం స్థలాన్ని సేకరించి, నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటికీ రాజీవ్‌నగర్, గోదావరి తీరంలో స్థల సేకరణ జరగలేదు.

- జన్నారం మండలం కవ్వాల్‌లో మల్లన్న గుడి సమీపంలో రెండు సంవత్సరాల క్రితం వైకుంఠధామం నిర్మాణం పూర్తి చేసి, అప్పటి ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రారంభించారు. కానీ వైకుంఠధామం చెరువులో ఉండటంతో బ్యాక్ వాటర్ చుట్టూ చేరి దారి లేకుండాపోయింది. పక్క నుంచి దారి తీసినా నీటిలో మునిగిపోయింది. దీంతో వైకుంఠదామంలో ఒక్క మృతదేహాన్ని కూడా కాల్చలేదు. అది పగుళ్ల తేలి కూలిపోయే స్థితికి చేరింది.
- నస్పూర్ పరిధిలోని సీసీసీ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో, తాళ్లపల్లి గోదావరి నది ఒడ్డున వైకుంఠధామాలు ఏర్పాటు చేయడానికి అధికారులు రూ.కోటి చొప్పునా నిధులు కేటాయించారు. సీసీసీ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రెండు సంవత్సరాల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించినా, నేటికీ పూర్తి కాలేదు. తాళ్లపల్లి గోదావరి నది ఒడ్డున నిర్మించే వైకుంఠధామం పనులు నేటికీ ప్రారంభానికే నోచుకోలేదు.



పాతమంచిర్యాలలో నిర్మాణ దశలో శ్మశానవాటిక



పగుళ్లు తేలి కూలిపోయే దశలో దిమ్మెలు

దండేపల్లి: మండలంలోని ద్వారక గోదావరి ఒడ్డున నిర్మించిన వైకుంఠధామం అసంపూర్తిగా ఉంది. గూడెం, గుడిరేవు గోదావరి తీరాల్లో నిర్మించిన వైకుంఠధామాలు గతేడాది క్రితం గోదావరి వరద తాకిడిలో కూలిపోయాయి. వాటి పునః నిర్మాణం గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో ఊత్కూరు, మోదెల గంపలపల్లి గ్రామాలకు వైకుంఠధామం మంజూరు కాలేదు. ఇటిక్యాల గ్రామానికి నిధులు మంజూరైనప్పటికీ అధికారులు స్థల సేకరణ చేయకపోవడంతో పనులు ప్రారంభించలేదు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని దొనబండ, నర్సింగాపూర్, హాజీపూర్ గ్రామాల్లోని వైకుంఠధామాలు ఇంకా వినియోగంలోకి రాలేదు. వేంపల్లి, గుడిపేట, నంనూర్ గ్రామాల వైకుంఠధామాలు ఊరికి దూరంగా, దారి సరిగ్గా లేకపోవడంతో స్థానికులు ఎవ్వరు కూడా వెళ్లేందుకు ఇష్టంగా లేరు. 12గ్రామ పంచాయతీల్లో వైకుంఠధామాలు అలంకారప్రాయంగా మారాయి.

చెన్నూర్ నియోజకవర్గంలో..



భీమారంలో నిరుపయోగంగా శ్మశానవాటిక

చెన్నూర్: మున్సిపాలిటీలో వైకుంఠధామం నిర్మాణానికి రూ.1.15కోట్ల నిధులు మంజూరయ్యాయి. గోదావరినదీ తీర ప్రాంతంలో స్థలం కేటాయించి, చేతులు దులుపేసుకున్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల, రచ్చపల్లి గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు శిథిలం కాగా, వెంకంపేటలో గోదావరి తీరాన నిర్మించిన వైకుంఠధామం రెండేళ్ల క్రితం కొట్టుకుపోయింది. లింగంపల్లిలో వైకుంఠధామానికి సరైన దారి లేదు. కత్తెరసాలలోని వైకుంఠధామానికి వెళ్లేందుకు దారి చిన్నదిగా ఉంది.

భీమారం: మండల కేంద్రంలో నిర్మించిన వైకుంఠధామం నిరుపయోగంగా మారింది. సమీపంలోని అటవీ ప్రాంతంలో దహన సంస్కరణలు చేపడుతున్నారు.

మందమర్రిరూరల్: మండలవ్యాప్తంగా పది వైకుంఠధామాలు నిర్మించగా, ఇంత వరకూ వినియోగంలోకి రాలేదు. బోరు సౌకర్యం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయలేదు.

జైపూర్: మండలంలో 19గ్రామ పంచాయతీల్లో శ్మశానవాటికలు పూర్తయినప్పటికీ సగానికి పైగా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ముదిగుంట గ్రామ పంచాయతీలో భూమి కోర్టు కారణంగా నిర్మాణం అసంపూర్తిగా ఉంది.

కోటపల్లి: మండలంలోని 31గ్రామపంచాయతీల్లో శ్మశానవాటికల నిర్మాణాలు పూర్తయ్యాయి. గ్రామాలకు దూరంగా ఉండటంతో నిరుపయోగంగా మారాయి. 20గ్రామపంచాయతీల్లో నీటి వినియోగం, రోడ్డు సౌకర్యం లేక పిచ్చి మొక్కలు మొలిచాయి. రొయ్యలపల్లి, ఎదుల బంధం గ్రామాల్లో పూర్తిగా అటవీప్రాంతాల్లో ఉండటంతో నిరుపయోగంగా మారాయి.

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అమరవాది గ్రామ శివారులో వైకుంఠధామం మంజూరై దాదాపు ఏడేళ్లు కావస్తోంది. అయినా పనులు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. కేవలం 20శాతం మేరకే పనులు ప్రారంభం కాగా నిధుల లేమి వల్ల నిలిచిపోయాయి.



కోటపల్లిలో నిరుపయోగంగా శ్మశానవాటిక

కదిలిన యంత్రాంగం..!

- పంటపొలాలను పరిశీలించిన విద్యుత్ అధికారులు
- అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేస్తామని హామీ

సాక్షి ఎఫెక్ట్..

బెల్లంపల్లి: నెన్నెల మండలంలోని గొల్లపల్లి రైతులు విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో బాధపడుతున్నట్లు 'కరెంట్ కటకట' అనే శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ మంచిర్యాల ఎస్ఈ శేషారావు, బెల్లంపల్లి డిస్కం డీఈ రాజన్న, ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి వెళ్లి కరెంట్ సమస్యతో ఎండిపోతున్న పంటపొలాలను పరిశీలించారు. రైతులతో ప్రత్యేకంగా మాట్లాడారు. లో ఓల్టేజీ సమస్య ఎందుకు ఏర్పడుతోందో, అందుకు గల కారణాలేంటో ఎస్ఈ రైతులకు సవివరంగా వివరించి అవగాహన కల్పించారు. ఆ కష్టాలను అధిగమించడానికి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం కొత్తగా డీడీలు తీసిన రైతులు డెవలప్‌మెంట్‌చార్జీ చెల్లిస్తే అదనంగా 63కేవీ డీటీఆర్‌ను తక్షణమే మంజూరు చేయిస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు. కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించడం వల్ల వ్యవసాయ విద్యుత్ మోటార్లకు లో ఓల్టేజీ సమస్య నివారణ జరుగుతుందని వివరించారు. అదేతీరుగా రైతులు పంపుసెట్ల వద్ద కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించడానికి ముందుకు రావాలని సూచించారు. రైతాంగానికి విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బెల్లంపల్లి డిస్కం ఏడీఈ రాంచందర్, నెన్నెల మండల ఏఈ మిట్టపల్లి మల్లయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ శేషారావు, పక్కన డీఈ రాజన్న

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మంచిర్యాలటౌన్: తన మొదటి ప్రాధాన్యత ఉచిత విద్య, వైద్యమేనని, అన్ని వర్గాల ప్రజలకు చదువు, వైద్యం అందించేందుకు కృషి చేస్తానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 4వ వార్డు సాయికుంటలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అమృత్ 2.0లో భాగంగా రూ.48.50కోట్ల వ్యయంతో తాగునీటి సరఫరా పైపులైన్, ట్యాంక్ నిర్మాణ పనులను, రూ.13.50కోట్లతో రంగంపేట వద్ద రాళ్లవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు, డీఎంఎఫ్‌టీ నిధులు రూ.5.67కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు ప్రారంభించుకున్నామన్నారు. ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తున్నానని అన్నారు. అమృత్ పథకం ద్వారా నీటి సరఫరా చేసేందుకు పైప్‌లైన్, ట్యాంక్ నిర్మాణ పనులను చేపట్టామని, త్వరలోనే వీటిని పూర్తి చేసి, తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చేస్తామన్నారు. ఐబీ ఆవరణలో ఉన్న ఆర్డీవో కార్యాలయం, ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్, అసంపూర్తిగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను పూర్తిగా తొలగిస్తామని, ఇప్పటికే అక్కడ పూర్తిస్థాయిలో 600పడకల ఆసుపత్రిలో భాగంగా ఎంసీహెచ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి కేటాయించినట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులను చేపట్టి, ప్రజలందరికీ వైద్యం అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, మున్సిపల్ ఇంజనీర్ మధుకర్, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్, పలు వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని అమృత్ నీటి సరఫరా పైపులైన్ ట్యాంక్ నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధులు రూ.20లక్షలు, రూ.55లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు శంకుస్థాపన చేశారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు చింత సువర్ణ, నాగభూషణం, ఎంపీపీ అన్నం మంగ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రమేష్, పట్టణాధ్యక్షుడు ఆరీఫ్, నాయకులు అశోక్ పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురిమల్ల వేణు, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, కమిషనర్ సీహెచ్ సతీష్, ఆర్ఓ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ వద్ద రూ.1.59 కోట్ల నిధులతో చేపట్టే కంట్రోల్ ప్యానల్ రూమ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు భూమిపూజ చేశారు. వరదల వచ్చినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఆలోచనతో కంట్రోల్ ప్యానల్ రూంను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఎంటీసీలు మోహన్, శ్రీనివాస్, నవీన్, మణెమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీష్, నాయకులు పాల్గొన్నారు.

సావిత్రీబాయిపూలేను ఆదర్శంగా తీసుకోవాలి

లక్సెట్టిపేట/మందమర్రిరూరల్/వేమనపల్లి/చెన్నూర్/కాసిపేట: సావిత్రీబాయి పూలే జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. పలు మండల కేంద్రాల్లో ఆదివారం సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో లక్సెట్టిపేట మండలం రంగపేట గ్రామంలో అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు ముల్కల్ల రాందాస్, కార్యదర్శి భైరం రవి, నాయకులు చాతరాజు రాజన్న, మురళి, దేవయ్య, చిప్పకుర్తి నారాయణ, ప్రేంసాగర్ పాల్గొన్నారు. మందమర్రిలో సుదర్శన్, వెంకటేశ్వరగౌడ్, శంకరయ్య, సత్యనారాయణ, ప్రతాప్, ప్రభాకర్, రాజేశం, భాస్కర్ తదితరులు ఉన్నారు. వేమనపల్లి మండలం సుంపుటంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్, సింగిల్‌విండో చైర్మన్ కుబిడె వెంకటేషం, మాజీ సర్పంచ్ కొండగొర్ల బాపు, కేవీపీఎస్ మండల కన్వీనర్ సంజీవ్ పాల్గొన్నారు. చెన్నూర్‌లో కాంగ్రెస్ నాయకులు చీర్ల సుధాకర్‌రెడ్డి, ఈర్ల నారాయణ, పాతర్ల నాగరాజు ఉన్నారు. కాసిపేట మండలం సోమగూడెంలో సంకె రవి, వేముల కృష్ణ, బోగె పోశం, బోగె రామకృష్ణ, దేవాపూర్ పెద్దగూడలో ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసంఘం నాయకులు, కాసిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మైదం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వేమనపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు



మందమర్రిరూరల్: పూలమాల వేస్తున్న నాయకులు



లక్సెట్టిపేట: అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో...

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాండూర్: మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా చేపట్టే సీసీ రోడ్డు పనులకు ఎంపీటీసీలు సిరంగి శంకర్, మాసాడి శ్రీదేవి ఆదివారం భూమిపూజ చేశారు. మండలంలోని ద్వారకపూర్‌లో రూ.3లక్షలతో, మండల కేంద్రంలోని సుభద్ర కాలనీలో రూ.4లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ మాసాడి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈసా, నాయకులు జుబేర్, ఆదమ్‌ఖాన్, విష్ణు, సంతోష్, శివకృష్ణ, బాబాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపట్టాలి


- ఏబీఏపీ రాష్ట్ర అధ్యక్షుడు తిరుమల్‌రావు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో అయ్యప్పస్వామి భక్తులు పట్టణ, గ్రామాల్లో అయ్యప్ప ధర్మ ప్రచారం చేసి, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) రాష్ట్ర అధ్యక్షుడు తిరుమల్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఏబీఏపీ జిల్లా జనరల్‌బాడీ సేదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అయ్యప్ప సేవా కార్యక్రమాలు చేపట్టి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని అభినందించారు.

నూతన కమిటీ ఎన్నిక..

జిల్లా ఏబీఏపీ నూతన కమిటీని ఎన్నికల ఇన్‌చార్జి మణి ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా నర్సింహారావు, అధ్యక్షుడిగా రాజ్‌కిరణ్, ఉపాధ్యక్షుడిగా రవీందర్, క్రిష్ణ, ప్రధాన కార్యదర్శిగా సంతోష్, సంయుక్త కార్యదర్శిగా కుమారస్వామి, కోశాధికారి లచ్చన్న, వాలంటరీ కమాండర్‌గా వెంకటరమణ, పీఆర్‌వోగా రాజేశం, కార్యవర్గసభ్యులుగా బేతి సత్యనారాయణావు, వెల్మరెడ్డి, శివారెడ్డి, శ్రీనివాస్, వడ్డె శ్రీనివాస్, ఓంనమోశివయా, కె.శ్రీనివాస్, సదానందం, రఘుపతిరావు, రాజేశంలను నియమించారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఉద్యోగులు

దండేపల్లి: మండలంలోని లక్ష్మీకాంతపూర్‌కు చెందిన ఈర్ల సతీష్, మౌనికల కుమారుడు అభిజిత్‌కుమార్ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నాడు. అతడి చికిత్స కోసం వైద్యులు రూ.10లక్షలు ఖర్చు అవుతాయని చెప్పారు. దీంతో దండేపల్లి మండల మున్నూరుకాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. సంఘ మండల అధ్యక్ష కార్యదర్శులు బొలిశెట్టి రాజన్న, పోలంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అప్పాల మనోహర్, కోశాధికారి కుంచె కిషన్, సభ్యులు జాబు సుగుణాకర్, బొలిశెట్టి బుచ్చన్న, కల్లె రాజన్న, నల్లెల సంతోష్, రామరాజు, కొండు రామన్న, ముత్తినేని రమేష్ పాల్గొన్నారు.